నమస్తే తెలంగాణ
# మహబూబాబాద్
3 | శనివారం 9 మార్చి 2024 | MAHABUBABAD


మెట్టుగుట్ట రామలింగేశ్వరాలయంలో అభిషేకం చేస్తున్న అర్చకులు


హనుమకొండ వేయిస్తంభాల ఆలయంలో..


కాళేశ్వరంలో అభిషేకం చేస్తున్న భక్తులు




# హరహర మహాదేవ

## శివనామ స్మరణతో మార్మోగిన ఆలయాలు



- వైభవంగా మహాశివరాత్రి వేడుకలు
- కనులపండువలా శివపార్వతుల కల్యాణం
- భక్తులతో పోటెత్తిన శైవాలయాలు
- కాళేశ్వరానికి 2లక్షలమందికి పైగా రాక
- అట్టహాసంగా వేయిస్తంభాల గుడి కల్యాణ మండపం ప్రారంభోత్సవం

'హరహర మహాదేవ.. శంభోశంకర'.. 'ఓం నమః శివాయః..' అంటూ శివనామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. ఉమ్మడి జిల్లా అంతటా శివరాత్రి వేడుకలు శుక్రవారం వైభవంగా జరిగాయి. అత్యంత భక్తి శ్రద్ధలతో ఉపవాసం ఉండి వేలాది మంది భక్తులు శైవాలయాలకు పోటెత్తారు. పరమేశ్వరుడి దర్శనం కోసం క్యూలో బారులు తీరి కనిపించారు. రాత్రంతా జాగారం చేసి శివుని సేవలో తరించారు. కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయం, రామప్ప రామలింగేశ్వరాలయం, హనుమకొండ వేయిస్తంభాల రుద్రేశ్వరాలయం, మెట్టుగుట్ట రామలింగేశ్వరాలయం, వరంగల్ కాశీబుగ్గ కాశీవిశ్వేశ్వరాలయం, స్వయంభూ శంభులింగేశ్వరాలయం, కోటిలింగాల, భట్టుపల్లి, పాలకుర్తి సోమేశ్వరాలయం, కురవి వీరభద్రస్వామి ఆలయం, కొడవటూరు సిద్ధేశ్వరాలయంతో పాటు ఉమ్మడి జిల్లాలోని అన్ని ఆలయాల్లో శివరాత్రి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. మహాపర్వదినం సందర్భంగా ఆలయాల్లో శివపార్వతుల కల్యాణాన్ని కనులపండువలా నిర్వహించగా భక్తులు తిలకించి తరించిపోయారు. కాళేశ్వర ముక్తీశ్వర స్వామివారిని సుమారు 2.20లక్షల మందికిపైగా భక్తులు దర్శించుకున్నారు. పుణ్యస్నానాలు చేసేవారితో కాళేశ్వరంలో త్రివేణి సంగమం పులకించిపోయింది. వేయిస్తంభాల గుడిలో పునరుద్ధరించిన కల్యాణమండప ప్రారంభోత్సవం అట్టహాసంగా కొనసాగింది. ఆలయ ఆవరణల్లో జాగరణ చేసే భక్తుల కాలక్షేపం కోసం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

– నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, మార్చి 8


విద్యుద్దీపాల వెలుగుల్లో కాశీబుగ్గలోని కాశీవిశ్వేశ్వరాలయం, ప్రత్యేక అలంకారంలో శివుడు(ఇన్‌సెట్)


రామప్ప ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు


వేయిస్తంభాల ఆలయంలో దర్శనం కోసం బారులు తీరిన భక్తులు


రామప్ప ఆలయ ఆవరణలో పేరిణి నృత్యం ప్రదర్శిస్తున్న కళాకారులు


భక్తులతో కిటకిటలాడుతున్న కాళేశ్వరంలోని త్రివేణి సంగమం


సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీని ప్రారంభించి మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, చిత్రంలో మంత్రి సీతక్క, ఎంపీ కవిత

# గిరిజనుల్లో అక్షరాస్యత పెంపే లక్ష్యం

- ములుగు అభివృద్ధికి గిరిజన యూనివర్సిటీ దోహదం
- స్థానిక యువత ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలి
- రెండు కోర్సులతో తరగతులు ప్రారంభం
- క్యాంపస్ ప్రారంభోత్సవంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి
- హాజరైన మంత్రి సీతక్క, ఎంపీ కవిత

ములుగు, మార్చి 8 (నమస్తే తెలంగాణ) : గిరిజనుల్లో అక్షరాస్యత పెంచడమే లక్ష్యమని, ప్రస్తుతం ప్రారంభమైన తరగతుల్లో 35శాతం వారికే రిజర్వేషన్ ఉంటుందని కేంద్ర పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జీ కిషన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ములుగు మండలం జాకారం యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో రాష్ట్ర మంత్రి సీతక్క, ఎంపీ మాలోత్ కవితతో కలిసి ఆయన గిరిజన యూనివర్సిటీ క్యాంపస్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ ములుగు అభివృద్ధికి ఈ యూనివర్సిటీ ఎంతో దోహదపడుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం భూమి అందించిన తర్వాత ప్రధాని మోదీతో యూనివర్సిటీ భవనానికి భూమిపూజ చేయించనున్నట్లు తెలిపారు. 2024–2025 విద్యా సంవత్సరం నుంచి యూత్ ట్రైనింగ్ సెంటర్లలో బీఏ ఇంగ్లిష్, బీఏ సోషల్ సైన్స్ విభాగంలో రెండు కోర్సులతో తరగతులను ప్రారంభించనున్నట్లు చెప్పారు. తాత్కాలిక క్యాంపస్ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో నడుస్తుందన్నారు. యూజీసీ పరిధిలో యూనివర్సిటీ పనిచేస్తుందని, సిబ్బంది వేతనాలు, ఇతర ఖర్చులు మొత్తం యూజీసీ ద్వారానే అందించనున్నట్లు కేంద్ర మంత్రి వెల్లడించారు. గిరిజనుల సంస్కృతీ సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, అడవుల్లో దొరికే వనమూలికలపై యూనివర్సిటీ ఆధ్వర్యంలో అధ్యయనం చేస్తారని చెప్పారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ గిరిజన యూనివర్సిటీతో ములుగు జిల్లా ఎడ్యుకేషన్ హబ్‌గా మారుతుందన్నారు. యూనివర్సిటీ కోసం మాజీ మంత్రి చందూలాల్ ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు. ఎంపీ కవిత మాట్లాడుతూ యూనివర్సిటీ ఏర్పాటుకు బీఆర్‌ఎస్ ఎంతో పాటుపడిందన్నారు. సమ్మక్క–సారలమ్మ పేరుతో యూనివర్సిటీని ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి ఏ శరత్, కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ డాక్టర్ పీ శబరీశ్, ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా, అదనపు కలెక్టర్ మహేందర్‌జీ, మానుకోట మాజీ ఎంపీ సీతారాంనాయక్, యూనివర్సిటీ ఓఎస్డీ డాక్టర్ వంశీకృష్ణారెడ్డి, ఎగ్జామినేషన్ కంట్రోలర్ పోరిక తుకారాం, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, యూనివర్సిటీ ఇంజినీరింగ్ అధికారి హనుమంతరావు, ఐటీ డైరెక్టర్ డాక్టర్ సంజయ్‌కుమార్‌శర్మ, డిప్యూటీ రిజిస్ట్రార్ అభిషేక్‌కుమార్, సిస్టమ్ అనాలజిస్ట్ మహ్మద్ అలీబేగ్ పాల్గొన్నారు.


కోర్సుల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కిషన్‌రెడ్డి, సీతక్క, కవిత

### మహిళా ప్రజాప్రతినిధులకు అగౌరవం

**శిలాఫలకంపై లేని ఎంపీ, ఎంపీపీ, జడ్పీటీసీ పేర్లు**

గిరిజన విశ్వవిద్యాలయ క్యాంపస్‌ను అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున జాకారం వైటీసీలో ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి సీతక్క, ఎంపీ కవిత హాజరయ్యారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. అధికారులు శిలాఫలకంపై మహిళా ప్రజాప్రతినిధుల పేర్లను నమోదు చేయకపోవడంతో మహిళా దినోత్సవం నాడు వారిని అగౌరవపర్చినట్లయింది. ఈ విషయంపై ఎంపీ కవిత.. ప్రారంభోత్సవ వేదికపైనే విచారం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అధికారులు ప్రొటోకాల్ పాటించలేదని, తన పేరుతో పాటు జడ్పీ చైర్‌పర్సన్, జడ్పీటీసీ, ఎంపీపీల పేర్లను ఎందుకు మరిచారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్లెక్సీల్లో కూడా తన ఫొటో పెట్టకపోవడం బాధాకరమన్నారు. కాగా అక్కడే ఉన్న కేంద్ర, రాష్ట్ర మంత్రులు కనీసం అధికారులను మందలించకపోవడం గమనార్హం. యూనివర్సిటీ నోడల్ ఆఫీసర్ డాక్టర్ వంశీకృష్ణారెడ్డి కల్పించుకొని తమకు ప్రొటోకాల్ విషయాలు తెలియవని, రెండు మూడు రోజుల్లో ప్రొటోకాల్ ప్రకారం శిలాఫలకాన్ని మార్చుతామని చెప్పారు.

# చారిత్రక కట్టడాలను కాపాడుకోవాలి

- వెయ్యేళ్లు ఉండేలా వేయిస్తంభాల గుడి కల్యాణ మండపం
- యునెస్కో గుర్తింపు కోసం కృషి చేస్తా : కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి
- వేయిస్తంభాల గుడిలో కల్యాణ మండపం ప్రారంభం
- మండపంలో వైభవంగా రుద్రేశ్వరస్వామి కల్యాణోత్సవం


వేయిస్తంభాల ఆలయంలో శివపార్వతుల కల్యాణోత్సవంలో పాల్గొన్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, ఎంపీ పసునూరి దయాకర్

హనుమకొండ చౌరస్తా, మార్చి 8: వేయిస్తంభాల ఆలయాన్ని నిర్మించేందుకు 72 ఏండ్లు పట్టినట్లు చారిత్రక ఆధారాలు చెబుతున్నాయని, నాడు ఎలాంటి ఆర్కిటెక్ట్, ఇంజినీర్ లేకుండా అద్భుతంగా నిర్మించారని, ఇక్కడ శిథిలావస్థకు చేరిన కల్యాణ మండపాన్ని మరో వెయ్యేళ్లు ఉండేలా పునర్నిర్మించి శివుడికి అంకితం చేశామని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. మహాశివరాత్రిని పురస్కరించుకొని వేయిస్తంభాల గుడిలో కుటుంబ సమేతంగా పూజలు చేసి కల్యాణ మండపాన్ని ప్రారంభించారు. మండపంలో శాంతి కల్యాణం, పుష్పార్చన, వాస్తుశాంతి నిర్వహించారు. అంతకుముందుకు వారికి ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కిషన్‌రెడ్డి మాట్లాడుతూ కాకతీయుల కట్టడాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉందన్నారు. మధ్య యుగకాలం నాటి ఈ గుడి.. సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక కేంద్రంగా ప్రత్యేకతను చాటుకుందని, ఇక్కడున్న మండపంలో గ్రామసభలు, నాట్య కార్యక్రమాలు నిర్వహించుకునేవారని చెప్పారు. ఆలయానికి యునెస్కో గుర్తింపు కోసం కృషి చేస్తానని, త్వరలోనే ఆలయ ప్రాంగణమంతా గార్డెన్, సౌండ్స్ అండ్ లైటింగ్స్ ఏర్పాటు చేసి ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. ఇక్కడ నంది విగ్రహం ఎంతో లైవ్‌లీగా ఉందన్నారు. స్థపతులు ఎన్ని ఇబ్బందులు వచ్చినా ఈ మహత్కార్యంలో భాగస్వాములై పనిచేశారని చెప్పారు. ధ్వంసమైన పిల్లర్ల స్థానంలో బ్లాక్ గ్రానైట్‌తో అచ్చం పాతవాటిలా ఉండే స్తంభాలను తయారుచేశారన్నారు.

### శిల్పులకు ఘనసన్మానం

19 సంవత్సరాలుగా కష్టపడి వేయిస్తంభాల కల్యాణమండపాన్ని పునర్నిర్మించిన శిల్పకారులను, స్థపతి శివకుమార్, ఇంటాక్ కన్వీనర్ పాండురంగారావు, ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ, నంది విగ్రహాన్ని రూపొందించిన శిల్పులను కేంద్ర మంత్రి ఘనంగా సన్మానించారు. స్తంభాల డాక్యుమెంటేషన్, మార్కింగ్‌లో కీలకంగా వ్యవహరించిన ఏఎస్సై ఉద్యోగులను సత్కరించారు. శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ మాట్లాడుతూ వేయిస్తంభాల ఆలయానికి యునెస్కో గుర్తింపు వచ్చేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీ పసునూరి దయాకర్, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, కార్పొరేటర్ తోట వెంకటేశ్వర్లు, గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, విజయచందర్‌రెడ్డి, కేంద్ర పురావస్తు శాఖ అధికారులు పాల్గొన్నారు.

**ఆర్కియాలజీ అధికారులపై కేంద్ర మంత్రి సీరియస్**

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆర్కియాలజీ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వేదికపై కిషన్‌రెడ్డి మాట్లాడకముందే ఆర్కియాలజీ అధికారి మల్లేశం 'ఓట్ ఆఫ్ థ్యాంక్స్ చెప్పాలి' అని మైక్‌లో అనడంతో మంత్రితో పాటు అక్కడ ఉన్న బీజేపీ నాయకులు మండిపడ్డారు. తర్వాత తేరుకున్న అధికారి 'ఇప్పుడు పసునూరి దయాకర్ మాట్లాడాలి' అని, ఎలాంటి ప్రొటోకాల్ పాటించకుండా ఎంపీని పిలవడంపై అందరూ సీరియస్ అయ్యారు.


ఖాళీబిందెలతో ధర్నా చేస్తున్న సీతారాంపురం మహిళలు

# గుక్కెడు నీళ్లందించండి..

**ఖాళీబిందెలతో మహిళల ధర్నా.. రెండు నెలలుగా ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన**

గణపురం, మార్చి 8 : సీతారాంపురం గ్రామస్తులు శుక్రవారం తాగునీటి కోసం ఖాళీబిందెలతో రోడ్డెక్కారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీతారాంపురం గ్రామం హరిజనవాడకు రెండు నెలల నుంచి తాగునీరు అందడం లేదని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. తాగునీటి పైపులైన్ల ద్వారా వచ్చే అరకొర నీళ్లు దేనికి సరిపోవడం లేదన్నారు. అప్పుడప్పుడూ ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నా ఒక కుటుంబానికి ఒక్కటి, రెండు బిందెలు మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారని వాపోయారు. రెండు నెలలుగా పంచాయతీ అధికారులు కాలనీలోకి ట్యాంకర్లను సైతం పంపించడం లేదని వాపోయారు. తమ కాలనీకి నీరందడం లేదని ఎన్నోసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకున్న నాథుడే లేడని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికలప్పుడే పాలకులకు తాము గుర్తుకు వస్తామని నేడు తమ గోడును పట్టించుకున్న నాయకుడు లేడన్నారు. ఇప్పటికైనా తమ కాలనీకి నీరందించాలని కోరారు.

